

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

దసరా...దీపావళి మధ్య రైల్వే జోన్‌కు భూమి పూజ

- కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు
- బెంగళూరు, చెన్నై నగరాలకు కూడా వందే భారత్ రైళ్లు వేయించడానికి కృషి చేస్తాం: ఎంపీ ఎం.శ్రీభరత్



విశాఖ నుంచి దుర్గ్‌కు బయలుదేరిన వందేభారత్ రైలు...(ఇన్‌సెట్‌లో) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు వేసిన కొత్త వందే భారత్ రైలు సర్వీసు సోమవారం ప్రారంభమైంది. దీనిని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలో గమ్యస్థానాలకు తీసుకువెళ్లే విమానాలతో పోటీ పడేలా రైల్వే శాఖ గంటకు 200 కిలోమీటర్ల వేగంతో నడిచే వందే భారత్ రైళ్లను నడపడం గర్వకారణమన్నారు. విశాఖలో రైల్వే జోన్‌కు దసరా..దీపావళి మధ్య శుభ ముహూర్తం చూసి భూమి పూజ చేస్తామన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, రైల్వే జోన్ రెండేళ్లలో ఆపరేషన్‌లోకి వచ్చే విధంగా ... మిగతా 8వ పేజీలో

భక్తి శ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



నర్సీపట్నంలో జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను (మిలాద్-ఉన్-నబీ) ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని వినిపించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

జిల్లాలో ఏటేటా తగ్గిపోతున్న విస్తీర్ణం

నష్టాల్లో చెరకు సాగు

పదేళ్ల క్రితం 82 వేల ఎకరాలు.. ఈ ఏడాది 15 వేల ఎకరాలు!

- విపరీతంగా పెరిగిన సాగు ఖర్చులు
- అంతంతమాత్రంగానే మద్దతు ధర
- పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు ఆవేదన
- చెరకు బకాయిల చెల్లింపుల్లో షుగర్ ఫ్యాక్టరీ తీవ్రజాప్యం
- ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లుతున్న సాగుదారులు

చోడవరం, సెప్టెంబరు 15:

ఒకప్పుడు జిల్లాలో వరి తరువాత అత్యధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగయ్యేది. అప్పట్లో జిల్లాలో నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలు వుండేవి. చెరకుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడం, షుగర్ ఫ్యాక్టరీలు చెరకు డబ్బులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం వంటి కారణాలతో రైతులు చెరకు సాగును వదిలేసి ఇతర పంటవైపు మళ్లుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం జిల్లాలో 82 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తున్నది. ఈ ఏడాది 15 వేల ఎకరాలకు పడిపోయింది. ప్రస్తుతం వున్న ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించడంతోపాటు మూతపడిన తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించకపోతే చెరకు సాగు విస్తీర్ణం మరింత తగ్గిపోయినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని రైతులు అంటున్నారు.

జిల్లాలో ఆరేళ్ల క్రితం వరకు తుమ్మపాల, గోవాడ, తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలు నడిచేవి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తుమ్మపాల షుగర్స్‌ను మూసేసింది. మూడేళ్ల తరువాత ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలకు తాళాలు వేసింది. దీంతో ఈ మూడు ఫ్యాక్టరీల పరిధిలో చెరకు సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఇక మిగిలిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణకు నోచుకోలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చెరకు సరఫరా చేసిన రైతులకు డబ్బులు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఆర్థిక పరిపుష్టి కోసం ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న వైసీపీ పాలకుల మాటలు నీటి మూటలుగా మారాయి. ఈ కారణాలతో ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు ఏటేటా తగ్గిపోయి, ఆ ప్రభావం చెరకు క్రషింగ్ లక్ష్యంగాపై పడింది. ఒకప్పుడు ఏటా ఐదు లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేసిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ.. గత సీజన్ (2023-24)లో లక్షన్నర టన్నులకు పడిపోయింది.



చెరకుతోట

పెట్టుబడితో పొంతన లేని రాబడి

చెరకు సాగు ఖర్చులు ఏటేటా విపరీతంగా పెరిగిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా పెంచుతున్న మద్దతు ధరతో పోలిస్తే చెరకు సాగుకు అయ్యే వ్యయం రెండు మూడురెట్లు అధికంగా వుంటున్నది. దుక్కి దున్నడం, విత్తనం, నాట్లు, ఎరువులు, కలుపుతీత, జడచుట్లు వంటి పనుల నుంచి చెరకు నరికి ఫ్యాక్టరీకి తోలే వరకు ఎకరాకు రూ.65-75 వేలు పెట్టుబడి అవుతున్నది. పంట బాగా పండితే ఎకరాకు 30 టన్నుల దిగుబడి వస్తుంది. కానీ జిల్లాలో సగటున 20 టన్నులకు మించడంలేదు. వర్షాధారభూముల్లో 15టన్నుల దిగుబడి వస్తే గొప్ప! చెరకు మద్దతు ధరను కూడా కేంద్ర ప్రభుత్వం కంటితుడుపుగానే పెంచుతున్నది. ఇక యూరియా మినహా ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు, పురుగుల మందుల ధరలు గత పదేళ్లలో భారీగా పెరిగిపోగా, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయ కపోవడంతో చెరకు తోటల్లో పనులకు కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. ఎక్కువ కూలి చెల్లించడంతోపాటు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేస్తేనే కూలీలు వచ్చే పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది రైతులకు పెట్టుబడి కూడా దక్కక చేతిచమురు వదులుతున్నది. చెరకు సాగుకు స్వస్తి పలికి వరి లేదా సరుగుడు, నీలగిరి తోటలు వేసుకుంటున్నారు.

కొత్త వంగడాలకు కొరవడిన ప్రోత్సాహం

ఏళ్ల తరబడి ఒకే రకమైన వంగడాలను సాగు చేయడం వల్ల చెరకు తోటలు తెగుళ్లను తట్టుకునే శక్తిని కోల్పోతున్నాయి. దీంతో దిగుబడి పెరగకపోగా మరింత తగ్గుతున్నది. తెగుళ్లను తట్టుకునే కొత్త వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి పూర్తిస్థాయిలో ... మిగతా 8వ పేజీలో

రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

- కోళ్ల అబద్ధం, చెరకు రైతు, మంచాల, చీడికాడ మండలం



షుగర్ ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేస్తే డబ్బులు వెంటనే చేతికి వస్తాయన్న నమ్మకం లేదు. గత కొన్నేళ్ల నుంచి చెరకు బకాయిల చెల్లింపులు చాలా ఆలస్యం అవుతున్నాయి. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. మరోవైపు కేంద్రం ప్రకటిస్తున్న చెరకు మద్దతు ధర గిట్టుబాటు కావడంలేదు. చెరకు రైతులకు ఉచితంగా విత్తనం, సబ్సిడీపై ఎరువులు సరఫరా చేయాలి. ఫ్యాక్టరీకి చెరకు తోలిన పక్షం రోజుల్లోనే డబ్బులు చెల్లించాలి. లేకపోతే చెరకు సాగు మరింత తగ్గిపోతుంది.

స్కూల్ కాంప్లెక్సులు కుదింపు

- ఎంఈవోల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్న డీఈవో
- మెరుగైన వసతులు ఉన్న పాఠశాలలు ఎంపిక
- నూతన విద్యా విధానంలో భాగంగా పునర్వ్యవస్థీకరణ



మండల విద్యాశాఖ కార్యాలయం

నర్సీపట్నం, సెప్టెంబరు 16: జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపునకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా విద్యా శాఖ అధికారి, మండల విద్యా శాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరుతూ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 129 స్కూల్ కాంప్లెక్సులు వుండగా, వీటి పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టబోతున్నారు.

నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఈవోలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మీద పూర్తి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు డీడీవో అధికారాలు అప్పగించనున్న విషయం తెలిసిందే. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల జీతభత్యాలు బిల్లులు పెట్టే బాధ్యతలు ఇక నుంచి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చూసుకుంటారు. క్రీడా మైదానాలు, సౌకర్యాలు లేని హైస్కూళ్లను తప్పించి అన్ని సౌకర్యాలు ఉన్న ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తారు. ఉదాహరణకు నర్సీపట్నం మండలంలో ఐదు స్కూల్ కాంప్లెక్సులు వుండగా, వీటిని నాలుగుకి కుదిస్తున్నారు. వేములపూడి పీబీఎం జడ్పీ ఉన్నత పాఠశాల, పెదబొడ్డేపల్లి జడ్పీహెచ్‌ఎస్, నర్సీపట్నం జడ్పీ (మెయిన్), జడ్పీ బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు స్కూల్ కాంప్లెక్స్‌లుగా వుండగా, వీటిలో పెదబొడ్డేపల్లి జడ్పీ హెచ్‌ఎస్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను కాంప్లెక్స్ నుంచి తప్పిస్తున్నారు కొత్తగా ... మిగతా 8వ పేజీలో

కారిడార్ భూ సమస్యపై కదలిక

నిర్వాసిత రైతులతో నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్

- కలెక్టర్ ఆదేశాలతో అధికారులు నిర్వహణ
- భూములు ఇచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరణ



ప్రత్యేక గ్రీవెన్స్ జరిగే కలెక్టరేట్ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో కోసం నక్కపల్లి మండలంలో భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, అప్పట్లో అధికారులు ప్రకటించిన ప్యాకేజీని అమలు చేయాలని నిర్వాసిత రైతులు చాలా కాలం నుంచి ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం పది గంటలకు నక్కపల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక క్లస్టర్‌కు భూములిచ్చిన వారి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు.

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా ఏపీఐఐసీ అధికారులు గతంలో నక్కపల్లి మండలం రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డి.ఎల్.పురం, తదితర గ్రామాల్లో 4,325 ఎకరాల ప్రభుత్వ, జిరాయితీ, డి.పట్టా భూములను సేకరించారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూ యజమానులకు పరిహారం అందజేస్తామని అప్పట్లో ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు ప్రకటించారు. కానీ ఆ విధంగా పరిహారం చెల్లించలేదు. 2016లో టీడీపీ ప్రభుత్వం భూములకు అవార్డు ప్రకటించి 90 శాతం మందికి పరిహారం చెల్లించింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిహారం చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రధానంగా డి.పట్టాదారులకు, ప్రభుత్వ భూములు సాగులో వున్న వారికి పరిహారం చెల్లించలేదు. భూములు కోల్పోయిన రైతులు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. రేపు, మాపు అంటూ కాలం వెల్లదీయడంతో రైతులు తీవ్ర నిరుత్సాహం చెందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో పర్యటించిన కూటమి నేతలను, భూములిచ్చిన రైతులు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ అందజేయాలని వినతులు సమర్పించారు. యువగళం పాదయాత్రలో భాగంగా 2023 డిసెంబరు 12న పాయకరావుపేట వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పలువురు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన లోకేశ్... తాము అధికారంలోకి రాగానే ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం రాకతో కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్‌కు భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి కలెక్టరేట్‌లో ప్రత్యేక పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, నర్సీపట్నం ఆర్డీఓ జయరామ్ నేతృత్వంలో నిర్వాసితుల సమస్యలు, డిమాండ్లపై చర్చించి, వినతులు స్వీకరిస్తారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్‌లో భూములు ఇచ్చిన రైతులు తగిన ఆధారాలు సమర్పించాలని, వాటిని పరిశీలించి తగిన న్యాయం చేస్తామని ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలు వెలవెల

- ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉండడంతో అరకొరగా విద్యార్థులు
- పలు స్కూళ్లలో ఇద్దరేసి ఉపాధ్యాయులు



వెంకియ్యపాలెం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మాకవరపాలెం, సెప్టెంబరు 16: నూతన విద్యా విధానంలో భాగంలో ప్రాథమిక పాఠశాలలను ఒకటి, రెండు తరగతులకే పరిమితం చేయడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. ఉన్నత పాఠశాలలకు ఒక కిలోమీటరు పరిధిలో వున్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఆ ప్రభావం మిగిలిన రెండు తరగతులపై పడింది. పలు ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే విద్యార్థులు వున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి కొన్నిచోట్ల ఒకరు, మరికొన్నిచోట్ల ఇద్దరు టీచర్లు వుండడం విశేషం.

మాకవరపాలెం మండలంలోని వెంకియ్యపాలెం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. జడ్.గంగవరం పాఠశాలలో నలుగురు విద్యార్థులు, ఒక టీచర్; దుంగలవానిపాలెం స్కూల్‌లో నలుగురు విద్యార్థుకు ఒక ఉపాధ్యాయుడు, సుభద్రయ్యపాలెం ఇద్దరు విద్యార్థుకు ఒక టీచర్, జి.కోడూరులో తొమ్మిది మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, మల్లవరం ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఎన్‌జీఆర్‌పీ అగ్రహారం పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, మామిడిపాలెంలో ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు... ఇలా సగానికిపైగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పట్టుమని పది మంది కూడా లేదు. కాగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అతి కొద్ది మంది మాత్రమే వుండడంతో కొంతమంది ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంఈవో-1 జాన్ ప్రసాద్.. పాయకరావుపేట హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ రోలుగుంట మండలం ఇన్‌చార్జి ఎంఈవో-1, మాకవరపాలెం మండలం ఇన్‌చార్జి ఎంఈవో-1గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్రిపాత్రాభినయం చేయాల్సి రావడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి రోడ్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాచేరు డైవర్షన్ రోడ్డుకు గండి పడిన ప్రదేశంలో బండరాళ్లను వేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో తాచేరు డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులను ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. 'ఆర్ అండ్ బీ నిర్లక్ష్యం' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో తాచేరు నదికి వరద పోటెత్తడంతో బీఎన్ రోడ్డుపై విజయరామరాజుపేట వద్ద తాత్కాలిక డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. వరద తీవ్రత తగ్గిన తరువాత కూడా రోడ్డు పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే మూడు జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించారు. వరద ప్రవాహం ధాటికి కదిలిపోయిన సిమెంట్ తూములను సరిచేసి, గండిపడిన ప్రదేశంలో ఎక్స్‌కవేటర్‌తో రాళ్లు, మెటల్, గ్రావెల్ వేయిస్తున్నారు. వరదనీరు అధిక మొత్తంలో వచ్చినా.. డైవర్షన్ రోడ్డుకు గండి పడకుండా వుండేలా సిమెంట్ తూములను మూడు వరుసల్లో వేయిస్తున్నామని, రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి డైవర్షన్ రోడ్డును అందుబాటులోకి తెస్తామని ఆర్‌అండ్‌బీ చోడవరం సెక్షన్ ఏఈ సత్య ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


హుస్సేన్ (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, సెప్టెంబరు 16: ప్రియురాలితో స్వల్ప వివాదం కారణంగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని బట్టపణుకులు- నడింపాలెం గ్రామాల మధ్య గల జీడితోటలో చోటుచేసుకుంది. దీనికి సంబం ధించి కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అసోం రాష్ట్రం బొర్రపేట రోడ్డు జానియా గ్రామానికి చెందిన నాజబుల్ హుస్సేన్(20) అదే గ్రామానికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి ఎన్‌హెచ్ 516-ఈ రహదారి నిర్మాణ పనులు చేసేందుకు నాలుగు నెలల క్రితం బట్టపణుకులు గ్రామానికి వచ్చారు. వీరు ప్రస్తుతం బట్టపణుకులు గ్రామంలో కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన క్యాంపులో ఉంటూ పనులు చేస్తు న్నారు. హుస్సేన్ స్వగ్రామంలోని ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తరువాత ఆమెతో మాట్లాడుతుండేవాడని సహచరులు తెలిపారు. అదే విధంగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో అతను ప్రియురాలితో మాట్లాడాడు. ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరగడంతో అతను క్యాంపు నుంచి బయటకు వెళ్లాడని స్నేహి తులు తెలిపారు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో వారంతా చుట్టు పక్కల గాలించారు. క్యాంపునకు అర కిలోమీటరు దూరంలో గల బట్టపణుకులు- నడింపాలెం గ్రామాల మధ్య జీడితోటలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు హుస్సేన్‌ను కిందకు దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించి ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు చెప్పారు. కాంట్రా క్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో సోమ వారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన లారీ క్లీనర్ మృతి


పైలా రాము (ఫైల్‌ఫొటో)

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి సోమవారం ఉమ్మలాడ జంక్షన్ వద్ద శారదా నదిలో శవమై తేలినట్టు పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. చోడవరం మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన పైలా రాము (46) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన తన అత్తవారి ఊరైన సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటకు వచ్చాడు. తన బావమరిది ఇంట్లో శుభకార్యం కూడా ఉండడంతో సాయంత్రం వరకు పనులు చేసి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించగా.. సైకిల్, మొబైల్ ఫోన్, దుస్తులు మూలపేట గ్రోయిన్ వద్ద లభ్యమయ్యాయి. కానీ అతని ఆచూ కీ లభించలేదు. దీంతో రాము అదృశ్యమైనట్టు ఇతని కుమారుడు మోహనరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా రాము మృతదేహం జాతీయ రహదారిలో ఉమ్మలాడ జంక్షన్ వద్ద శారదానది ఒడ్డున తేలిందని మోహనరావు సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు చెప్పారు.

ఆవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని గుంటపల్లి శివారు పెద్దిపాలెం వెళ్లే ఆవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయట పడినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయస్సు గల పురుషుడు నిర్జీవంగా పడివున్నట్టు సోమవారం ఉదయం పాయకరావుపేట ఆర్.ఐ. టి.త్రినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నీటిలో ఉండడం వల్ల బాగా ఉబ్బిపోయి, ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఇతను నలుపు రంగు ప్యాంటు, సిమెంటు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు ధరించి వున్నాడని, ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

125 లీటర్ల నాటుసారా స్వాధీనం

▸▸ బాలుడితోసహా ఒక వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 16: స్థానిక పోలీ సులు 125 లీటర్ల నాటుసారాతో ఒక వ్యక్తిని, మరో బాలుడిని అరె స్టు చేశారు. నాటుసారా రవాణా అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి మండలంలోని పెంటకోట శివారులో తాండవ నది దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ క్యాన్లలో 125 లీటర్ల నాటుసారాను పడవలో తరలిస్తుండగా గోపాలపట్నం గ్రామానికి చెందిన వాడబోయిన కొండబ్బాయిని, మరో బాలుడుని పట్టు కున్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. ఇరువురిని కోర్టులో హాజరుపరిచిన అనంతరం కొండబ్బాయిని ఎలమంచిలి సబ్ జైలుకు, బాలుడిని విశాఖ జువెనైల్ హోమ్‌కు తరలించారు.

చెరువులో పడి ఒకరి మృతి

▸▸ ప్రాణాలతో బయటపడిన మరొకరు


ఇమ్మాన్యుయేల్ (ఫైల్ ఫొటో)

పరవాడ, సెప్టెంబరు 16: ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పరవాడ ఎస్సీ కాలనీకి చెందిన జన్ని ఇమ్మాన్యుయేల్ (25), దేశపాత్రునిపాలేనికి చెందిన పి.రవికుమార్, రాజు స్నేహితులు. వీరు సోమవారం ఉదయం మద్యం సేవించిన అనంతరం సమీపంలో ఉన్న టిఫిన్ షాపు వద్ద అల్పాహారం చేశారు. రాజు టిఫిన్ షాపు వద్ద ఉండిపోగా, మిగతా ఇద్దరూ కలిసి శివాలయం సమీపంలో చెరువు గట్టుమీదుగా నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులోకి పడిపోయారు. వీరిలో ఇమ్మాన్యుయేల్ నీటిలో మునిగిపోగా, రవికుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు ఇమ్మాన్యుయేల్‌ను బయటకు తీశారు. కానీ అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. మృతుడి మేనమామ పి.గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

పూసపాటిరేగ, సెప్టెంబరు 16: విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చోడమ్మఅగ్రహారం వద్ద జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన మిరియాల సరస్వతి(51) మృతిచెందింది. వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన సరస్వతి, బంధువు నీలాపు అనసూయలు కలిసి పని నిమిత్తం సోమవారం శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఆటోలో బయలుదేరారు. చోడమ్మఅగ్రహారం టీ టైం వద్ద దిగారు. అనంతరం సరస్వతి రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళుతున్న వ్యాన్ ఆమెను బలంగా ఢీకొంది. తలపై బలమైన గాయం తగిలి రక్తస్రావం జరగడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

▸▸ నిధులు ఇచ్చి కాపాడతామని ఒక వైపు ప్రకటన

▸▸ మరోవైపు 100 మందిని డిప్యుటేషన్‌పై ఎన్ఎండీసీకి పంపేందుకు రంగం సిద్ధం

▸▸ ఈ నెల 23 నుంచి 25 వరకు ఇంటర్వ్యూలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కర్మాగారానికి నిధులు సమకూరుస్తామని, వాటితో ఉత్పత్తిని మెరుగుపరచుకుని నష్టాల నుంచి బయటపడాలని ఉద్యోగులకు చెబుతోంది. మరోవైపు విశాఖపట్నంలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లలో 100 మందిని అత్యవసరంగా ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్ఎండీసీకి చెందిన నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించింది. ఇందుకోసం ఈ నె 23 నుంచి 25వ తేదీ వరకు ఎన్ఎండీసీ అధికారులు విశాఖపట్నం కర్మాగారంలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపింది. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని సూచించింది. విశాఖపట్నం కర్మాగారంలో పనిచేస్తున్న సీనియర్లు అందరినీ ఇతర ప్లాంట్లకు పంపిచేసి...ఇక్కడ మిగిలిన వారితో ఏమి చేయాలని ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడి కర్మాగారం పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోవడం గమనించిన సీనియర్ మేనేజర్ స్థాయి అధికారులు 200 మంది ఇప్పటికే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రతి నెలా సగటున 20 మంది పదవీ విరమణ చేస్తున్నారు. మరోవైపు నియామకాల ప్రక్రియ చాలాకాలం క్రితమే ఆపేశారు. దీంతో ఇప్పటికే కీలక విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్లాంటును పూర్తి స్థాయిలో నడపాలంటే ప్రస్తుతం 300 మంది ఇంజనీర్లు అవసరమని, కనీసం కాంట్రాక్టు ప్రాతిపదికనైనా నియమించుకోవడానికి అనుమతి ఇవ్వాలని గత ఏడాది నాటి సీఎండీ అతుల్ భట్ ఉక్కు మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగా, ఉన్నవారిని దశల వారీగా ఇతరచోట్లకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇంకో వైపు స్వచ్ఛంద పదవీ విరమణకు కూడా నిధులు ఇస్తామని చెబుతున్నారు.

ఇదంతా కుట్ర

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

కేంద్రం చేపడుతున్న చర్యలు చూస్తుంటే...విశాఖపట్నం ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఏదో కంటితుడుపుగా కొంత ఆర్థిక సాయం చేసి, నష్టాల నుంచి బయటకు రాలేకపోయారు కాబట్టి...ఇక ఏమీ చేయలేమని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నారు. అలాకాకుండా ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూరిస్తే 100 శాతం ఉత్పత్తితో ఈ గండం నుంచి గట్టెక్కిస్తాం.

కొనసాగుతున్న ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

▸▸ 15 మీటర్లు పొడవున గండి ▸▸ 50 క్యూసెక్కుల నీరు వృథా

మాకవరపాలెం, సెప్టెంబరు 16: ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు రెండో రోజూ కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం రాచపల్లి 99.6 కిలోమీటరు వద్ద 10 మీటర్ల వెడల్పున గండి పడిన సంగతి తెలిసిందే. అయితే జీవీఎంసీ అధికారులు గండి పూడ్చివేత వెంటనే ప్రారంభించినప్పటికీ నీటి ఉధృతికి పనులు ముందుకు సాగలేదు. ఆదివారం రాత్రి నాటికి గండి పూడ్చివేత పూర్తవుతుందని అధికారులు భావించినప్పటికీ నీటి ప్రవాహం మరింత పెరిగి గండి మరో 5 అడుగులు వెడల్పు పెరిగింది. సోమవారం ఉదయం నుంచి మట్టిని గోని సంచుల్లో నింపి గండి పనులు పూర్తి చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే నీటి ప్రవాహాన్ని అడ్డుకట్టు వేసేందుకు కొండలఅగ్రహారం, తామరం వద్ద ఏలేరు కాలువకు గండ్లు కొట్టి నీటిని మళ్లించారు. గండి వల్ల 50 కూసెక్కులు నీరు వృథాగా పోయిందని, మంగళవారం నాటికి పనులు పూర్తి చేస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.


ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు చేస్తున్న దృశ్యం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో సమగ్ర అభివృద్ధి

▸▸ దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని మోదీ కృషి

▸▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


ఎంపీ సీఎం రమేశ్‌కు ఏటికొప్పాక కళాఖండాన్ని బహూకరిస్తున్న మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి

ఎలమంచిలి, సెప్టెంబరు 16: దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ విశేష కృషి చేస్తున్నారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇటు రాష్ట్రాన్ని, అటు దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం సర్వోతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు చురుగ్గా జరగాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి మాట్లాడుతూ, జాతీయ రహదారి నుంచి ఏటికొప్పాక వరకు రోడ్డును బాగు చేయించాలని, రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని, లక్కబొమ్మల కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. సీఎం రమేశ్ బదులిస్తూ.. ఏటికొప్పాక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఆయన లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మెడికల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఎంపీ సీఎం రమేశ్‌కు వినతి


ఎంపీ సీఎం రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికులు

కొత్తూరు (అనకాపల్లి), సెప్టెంబరు 16: జిల్లాలో ఉన్న ఎనిమిది ప్రభుత్వ వైద్య విభాగాల్లో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేశ్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ, కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వడంలేదని, వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని కుంటిసాకులు చెబుతున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలుచేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 30వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, సుధీర్, వడ్డాది ఈశ్వరరావు, వినోద్‌కుమార్, విజయ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

గంప సీతాఫలాలు రూ.500


మాడుగుల సంతకు వచ్చిన సీతాఫలాలు

మాడుగుల, సెప్టెంబరు 16: ఏజెన్సీ నుంచి గిరి రైతులు తీసుకువచ్చిన సీతాఫలాల ధర ఆశాజనకంగా ఉంది. మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతకు దేవాపురం, సలుగు, ఈదులపాలెం, కందులమామిడి, కక్కి, వంటలమామిడి వంటి గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన రైతులు గంపలు, తట్టల్లో సీతాఫలాలను తీసుకు వచ్చారు. అయితే ఒక్కో సీతాఫలం గంప రూ.400 నుంచి రూ.500 వరకూ విక్రయించారు. ఒక తట్టలో 50 సీతాఫలాలు ఉంటాయి. దీంతో ఈ వారం సీతాఫలం ధర ఆశాజనకంగా ఉందని గిరి రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

కరాటే పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

పరవాడ, సెప్టెంబరు 16 : స్టీల్ ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఇటీవల నిర్వహించిన నాలుగో రాష్ట్రస్థాయి కుడో చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్టు కోచ్ జి.పుష్పారావు తెలిపారు. టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, గొర్లి వంశీ, అన్సుజా, అక్షితవర్మ, సునైన, రిత్విక్, కె.ప్రవర్షిత, ఎం.కార్తీక్, కె.దీక్షిత, డీఏ గౌతమ్, కె.ఫణీంద్రకుమార్, బి.మణికంఠ, ఎన్.లీలా, ఎన్.గోపాల్‌కుశాల్ బంగారు పతకాలు సాధించారు. వీరికి కుడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మహల్వారా, ప్రధాన కార్యదర్శి జాస్మిన్‌మక్వానా చేతుల మీదుగా పతకాలు అందజేశారు. ఈ ఏడాది నవంబరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని కోచ్ తెలిపారు.

నాలుగు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 16 : నాలుగు కిలోల గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు మాడుగుల ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని ముకుందపురం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆ సమయంలో సత్యసాయి జిల్లాకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తున్నాడని, అనుమానంతో అతనిని ఆపి బ్యాగ్ తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయని చెప్పారు.

వివాహిత కిడ్నాప్‌నకు యత్నం

▸▸ ఆటోలో బలవంతంగా తీసుకువెళుతుండగా కేకలు వేసిన బాధితురాలు

▸▸ వాహనాన్ని అటకాయించిన స్థానికులు

▸▸ ఆమెను వదిలి పరారైన నిందితులు

▸▸ రౌడీషీటర్ సహా మరొకరి అరెస్టు

పెందుర్తి, సెప్టెంబరు 16: వివాహితను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన రౌడీ షీటర్‌తో పాటు అతడికి సహకరించిన మరొకరిని సోమవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన వివాహిత ఇటీవల వేపగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న తన బాబాయి ఇంటికి వచ్చింది. పెందుర్తి జేఎన్ఎన్ఎంయూఆర్ కాలనీకి చెందిన నాగుల మోహన్ (27), అతడి స్నేహితులు మరో ఇద్దరు సోమవారం వివాహిత బాబాయి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెను బెదిరించి బలవంతంగా అక్కడ నుంచి తీసుకువెళ్లేందుకు యత్నించగా...ఆమె ప్రతిఘటించసాగింది. ఈలోగా బయటకు వెళ్లిన ఆమె బాబాయి వచ్చి అడ్డుకోగా నాగుల మోహన్, అతడి స్నేహితులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అనంతరం వివాహితను బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకుని వచ్చి ముందుగా సిద్ధం చేసుకున్న ఆటోలో చినముషిడివాడలో గల స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆటో శారదా పీఠం సమీపంలోకి వచ్చేసరికి వివాహిత బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు కొందరు గమనించి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో దొరికిపోతామని భావించిన మోహన్, అతడి స్నేహితులు ఆటోలో నుంచి వివాహితను కిందకు తోసేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆమె జరిగిన విషయాన్ని తన భర్తకు సమాచారం అందించగా...ఆయన 100కు డయల్ చేశారు. సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ స్వామినాయుడు అక్కడకు చేరుకున్నారు. ఆమె ద్వారా సమాచారం సేకరించి కిడ్నాప్‌నకు యత్నించిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చినముషిడివాడలో నాగుల మోహన్‌ను, అతనికి సహకరించిన చినముషిడివాడ పాత ఊరుకు చెందిన నందవరపు కుమార్ (28) పట్టుబడ్డారు. మోహన్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ ఉందని, అది ఇటీవల పెందుర్తి పీఎస్‌కు బదిలీ అయ్యిందని సీఐ తెలిపారు. మరో నిందితుడు కుమార్ లారీ డ్రైవర్ అని అన్నారు. కిడ్నాప్ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని ఆచూకీ కోసం వెదుకుతున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ అన్నారు

దూర్వగణపతి అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

▸▸ ముగిసిన స్వయంభూ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు


దూర్వగణపతి అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం, సెప్టెంబరు 16: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వయంభూ విఘ్నేశ్వరుడు దూర్వగణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చలపతి ముగింపు ఉత్సవాల సందర్భంగా స్వామివారిని అలంకరించారు. స్వయంభూ విఘ్నేశ్వరుడు నవరాత్రి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హాజరై పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఈవో సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఉప్పల సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు చలపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పుటేరును పరిశీలించిన అధికారులు


ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామరాజు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి, సెప్టెంబరు 16: మండలంలో ఉప్పుటేరు వరదతో నీటమునిగిన అమలాపురం నుంచి సముద్ర తీరానికి వెళ్లే రహదారిని సోమవారం ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.సీతారామరాజు, గ్రామ కార్యదర్శి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఉప్పుటేరు పొంగడంతో రహదారి నీట మునిగిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా కలెక్టర్ స్పందించారు. తక్షణమే ఉప్పుటేరును పరిశీలించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సీతారామరాజును ఆదేశించారు. దీంతో ఆయన ఉప్పుటేరును, నీట మునిగిన రహదారిని పరిశీలించారు. సముద్రం ఆటు, పోటుల వల్ల ఉప్పుటేరులోకి అధిక మొత్తంలో నీరు వచ్చిందని స్థానికులు చెప్పారు. నీటి ప్రవాహం తగ్గిన తరువాత మట్టితో రోడ్డు ఎత్తు పెంచాలని సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఆయన సూచించారు.

నేటి నుంచి సదరం క్యాంప్

▸▸ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హతకు వెరిఫికేషన్

▸▸ ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్


డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16: ఈ నెల మొదటి వారంలో భారీ వర్షాల కారణంగా వాయిదా వేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హత వెరిఫికేషన్ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి పునః ప్రారంభమవుతుందని అనకాపల్లి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మండలాల వారీగా క్యాంప్ నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన సబ్బవరం, కె.కోటపాడు, 18న నర్సీపట్నం, పాయకరావుపేట, 19న కశింకోట, ఎలమంచిలి, 20న కోటవురట్ల, నక్కపల్లి, 21న నాతవరం, గొలుగొండ, 23న రావికమతం, రోలుగుంట, 24న దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, 25న ఎస్.రాయవరం, మాకవరపాలెం, 26న చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హత పరిశీలన, పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

జాతీయ యోగా పోటీలకు గురుకుల పాఠశాల బాలికలు


పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఎంఅప్పలనాయుడు

పరవాడ, సెప్టెంబరు 16: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో భీమిలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు సత్తా చాటారు. ఈ పాఠశాల నుంచి యోగా పోటీల్లో ఏడుగురు పాల్గొనగా నలుగురు పతకాలను సాధించారు. 12-14 ఏళ్ల విభాగంలో బి.వైష్ణవి బంగారు, ఎస్.కౌశిక కాంస్యం, 14-16 ఏళ్ల విభాగంలో కె.వెంకట వైష్ణవి రజత, కె.భావన కాంస్య పతకాలు సాధించారు. ఈ ఏడాది అక్టోబరులో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని పాఠశాల యోగా కోచ్ ఆంజనేయులు తెలిపారు.

అనకాపల్లిలో సినిమా షూటింగ్ సందడి


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : 'అనకాపల్లి' పేరు మీద నిర్మించే సినిమాలోని కొన్ని సన్నివేశాలను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చిత్రీకరించారు. నక్కిన నేరేటిక్స్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి హీరో విక్రమ్, హీరోయిన్ సంధ్య మధ్య ప్రేమ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే నక్కిన త్రినాథరావు, డైరెక్టర్‌గా ఖగేష్ తమ్మినేని వ్యవహరిస్తున్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం

» మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుతో పలు చోట్ల కోలాహలం



అనకాపల్లిలో శారదా నది ఒడ్డున భక్తుల సందడి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలో ఉదయం నుంచి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను నిర్వాహకులు ఊరేగింపుగా శారదా నదికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. భారీ వినాయకులను క్రేన్ సహాయంతో పోలీసులు, సిబ్బంది నది మధ్యలోకి తీసుకువెళ్లి అనుపు చేశారు. దీంతో మెయిన్‌రోడ్డు, శారదానది ఒడ్డున భక్తుల కోలాహలం కనిపించింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు.



నదిలో స్వామివారి విగ్రహాన్ని క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

రాంబిల్లి : వాడనర్సాపురంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని సోమవారం ఇక్కడి సముద్రంలో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు దేముడు, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయకుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం : వినాయక ఉత్సవాల్లో భాగంగా సబ్బవరం ఎస్సీ, బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక విగ్రహాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి, అన్నసమారాధనను ప్రారంభించారు. అలాగే సాయినగర్ కాలనీలో వైసీపీ నాయకుడు గండి రవికుమార్ అన్నసమారాధన ప్రారంభించారు. ఈ వేడుకల్లో నాయకులు ఇందలి రమణ, బీఏ రావు, కర్రి కనకరాజు, కర్రి బాబు, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, బంతికోళ్ల పద్మ, దెడ్డం పద్మావతి, గొర్లి కుమార్, శింగపల్లి శ్రీను, కర్రి నర్సింగరావు, యడ్ల నాయుడు, ఆడారి వెంకట్, మామిడి శంకరరావు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న రమేశ్‌బాబు

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ర్యాలీ



అడ్డరోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 16 : ఓజోన్ పొర పరిరక్షణపై పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం పెదగుమ్ములూరు నుంచి అడ్డరోడ్డు జంక్షన్ వరకు విద్యార్థులు, యువకులతో కలిసి ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల సమన్వయకర్త సత్యనారాయణ మాట్లాడుతూ ఓజోన్‌పొర మరింత క్షీణిస్తే కలిగే నష్టాలను వివరించారు. ప్రధానంగా ఓజోన్ పొర క్షీణిస్తే సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల్లో 97 శాతం నుంచి 99 శాతం వరకు భూమిపై మానవ జీవాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. దీని వలన చర్మ, జన్యు సంబంధిత వ్యాధులు, రోగ నిరోధక శక్తి క్షీణించడం వంటివి జరుగుతాయన్నారు. ఈ పరిస్థితుల్లో పర్యావరణం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్టు నరికివేత!

ఎలమంచిలి, సెప్టెంబరు 16 : ఇక్కడి పోలిమేరమ్మ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన గల విలువైన చెట్టును గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసి తరలించినట్టు స్థానికుల ద్వారా తెలిసింది. ఆదివారం రాత్రి ఈ తంతును గుట్టుగా సాగించారని సమాచారం. పచ్చని చెట్లను కొందరు మాయం చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం వల్లే తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా సూచనలు చేయాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు పక్కన కనిపించిన చెట్టు మోడు

స్కూల్ కాంప్లెక్సులు కుదింపు

... 5వ పేజీ తరువాయి

బలిఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు. గొలుగొండ మండలంలో ఏల్‌పురం, జోగుంపేట, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, కొత్త మల్లంపేట స్కూల్ కాంప్లెక్సులు ఉండగా... రీఆర్గనైజేషన్‌లో భాగంగా కొత్త మల్లంపేట స్కూల్ కాంప్లెకును ఎత్తివేయనున్నట్టు తెలిసింది. విద్యార్థులకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు స్కూల్ కాంప్లెక్స్‌లోనే జరిగేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నారు.

సీఆర్‌ఎంటీలలో ఆందోళన

స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సీఆర్‌ఎంపీలలో ఆందోళన మొదలైంది. ఒక్కొక్క స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఒక సీఆర్‌ఎంపీ పని చేస్తున్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని స్కూల్ కాంప్లెక్స్‌లను ఎత్తివేస్తే వాటిల్లో పని చేస్తున్న సీఆర్‌ఎంటీలను ఏం చేస్తారన్న దాని మీద స్పష్టత లేక పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

న(క)ష్టాల్లో చెరకు సాగు

... 5వ పేజీ తరువాయి

సత్ఫలితాలు ఇవ్వడంలేదు. చెరకు సాగు చేయాలంటే ఎకరాకు మూడు టన్నుల విత్తనం అవసరం. విత్తనం చెరకు టన్ను రూ.4-5 వేలు వుంటుంది. దీంతో విత్తనం ఖర్చే ఎకరాకు రూ.12-15 వేలు అవుతున్నది. అరటిలో మాదిరిగా టిష్యూ కల్చర్ ద్వారా చెరకు విత్తనాన్ని అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు రెండు దశాబ్దాల నుంచి పరిశోధనలను కొనసాగిస్తూనే వున్నారు.

పదేళ్లలో ఐదో వంతుకు పడిపోయిన సాగు విస్తీర్ణం

జిల్లాలో పదేళ్ల క్రితం (2014లో) 82 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఆ తరువాత నుంచి సాగు ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. అంతేస్థాయిలో చెరకు మద్దతు ధర పెరగడంలేదు. దీంతో రైతులు క్రమేపీ చెరకు సాగు నుంచి బయటకు వచ్చేస్తున్నారు. 2019లో 48 వేల ఎకరాలకు, 2022నాటికి 37 వేల ఎకరాలకు, గత ఏడాది 19 వేల ఎకరాలకు, ఈ ఏడాది 15 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

పల్లెల్లో ప్రమాద ఘంటికలు

సత్యవరంలో కలవరపెడుతున్న కల్వర్టు



సత్యవరం ఊర కాలువపై కల్వర్టుకు ఓ వైపు రక్షణగోడ లేని దృశ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని సత్యవరంలో ఊరకాలువపై గల కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో అక్కడి వారంతా భయాందోళన చెందుతున్నారు. ఎస్సీ కాలనీలోకి వెళ్లే రోడ్డులో గల ఈ ఊరకాలువ కల్వర్టుపై నుంచి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఓ వైపు రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతో పాటు ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురిసే సమయాల్లో కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని చెపుతున్నారు. అధికారులు వెంటనే గోడ నిర్మించాలని కోరుతున్నారు.

భయపెడుతున్న సామాజిక భవనం



శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనం (అంతర్ చిత్రం) శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్న దృశ్యం

పరవాడ, సెప్టెంబరు 16 : మండలంలోని కలపాక పంచాయతీ పరిధి పెదస్వయంభూవరంలో గల సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 40 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. ప్రస్తుతం శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతూ ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. తలుపులు, కిటికీలకు చెదలు పట్టాయి. ఈ కారణంగా ప్రధాన ద్వారాన్ని పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. గ్రామంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించుకుంటామని అంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంతా భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

కోటవురట్ల, సెప్టెంబరు 16 : మేజర్ పంచాయతీ కోటవురట్ల శివారు రాట్నాపాలెం ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు కూలిపోతుందోనని అక్కడివారం భయాందోళన చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం పదివేల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి దీని నిర్వహణను పెద్దగా పట్టించుకోకపోవడంతో నేడు ఈ దుస్థితికి చేరుకుంది. ప్రస్తుతం ట్యాంకు శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని పలువురు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు మాట్లాడుతూ ట్యాంకును వెంటనే తొలగించకుంటే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు.



రాట్నాపాలెం ఎస్సీ కాలనీలో గల రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

నేడు పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ

పాయకరావుపేట, సెప్టెంబరు 16 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం పెద్ద సంఖ్యలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రమణ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకటినుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు నులిపురుగులు లేకుండా ఆరోగ్యవంతంగా ఉండేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, అంగన్‌వాడీ కేంద్రాలు తదితరాల్లో వీటిని అందజేయనున్నామన్నారు. వీటిని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

కంచి పీఠాన్ని సందర్శించిన మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 16 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కంచి కామాక్షి అమ్మవారిని రాష్ట్రం హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గోత్రనామాలతో పూజలు నిర్వహించిన అనంతరం కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీని కలిసి ఆశీర్వాదం పొందారు.



శంకర విజయేంద్ర సరస్వతి ఆశీస్సులు పొందుతున్న అనిత

నేడు కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం జరగనున్న విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మత్తుర్తి గంగారావు, ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబులు సంఘ ప్రతినిధులకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించాలని ఈ నెల 14వ తేదీన ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని వివరించారు.

‘భారతీయ ప్రాచీన కళలను ప్రోత్సహించాలి’

ఎలమంచిలి, సెప్టెంబరు 16 : పట్టణంలోని కొత్తపేట సీతారాముల ఆలయ ప్రాంగణంలో శారద సంగీత విద్యానిలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయిని ముదిగొండ సావిత్రమ్మ, ఇవటూరి సాంబశివరావుల అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో డాక్టర్ పంతుల రమా గాత్ర కచేరీ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతీయ ప్రాచీన కళలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆదరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, ఎస్వీ సూర్యనారాయణ మూర్తి, కామేశ్వరి తదితరులతో పాటు పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సంగీత విద్యాలయం ప్రతినిధులు, విద్యార్థులు

నక్కపల్లిలో బ్రహ్మకమల వికాసం

నక్కపల్లి, సెప్టెంబరు 16 : చల్లని ప్రదేశాల్లో రాత్రి వేళల్లో వికసించే బ్రహ్మ కమల పుష్పం నక్కపల్లిలో ఓ ఇంట పూసింది. వీవర్స్ కాలనీలో నివసిస్తున్న దేవి తన ఇంటి పెరట్లో ఈ మొక్క నాటారు. ఆదివారం రాత్రి ఈ మొక్కకు పువ్వు పూయడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేదు. పరిసరాలవారు ఈ పుష్పాన్ని ఆసక్తిగా తిలకించారు.



వివిధ పోటీల విజేతలకు బహుమతులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : ఇక్కడి వినాయక సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. నెహ్రూచౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. అలాగే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గణపతి విగ్రహాల సెట్టింగ్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు కూడా బహుమతులను అందించారు. వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర, మళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మజీ ఎమ్మెల్యే పీలా గోవింద

వేడుకగా మిలాద్ వున్ నబీ



బయ్యవరంలో మాట్లాడుతున్న మైనార్టీ సెల్ అధ్యక్షులు బాబర్



అనకాపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : మిలాద్ వున్ నబీ వేడుకలను పలు మండలాల్లో ముస్లింలు సోమవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి చిననాలుగురోడ్ల జంక్షన్‌లోని జామియా మసీదు నుంచి నెహ్రూచౌక్ వరకు శాంతియాత్ర జరిపారు. జామియా మసీదు అధ్యక్షులు పీఎస్ఎస్ హుస్సేన్, షేక్ ఉమర్, రియాజ్, బడాబాబు, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. నూరి మసీదు, అబ్దుల్ అజీషా ఖాదరి దర్గా, బయ్యవరం అన్సర్ మదిని ఔలియా దర్గాలో ముస్లింలు ఈ వేడుకను జరుపుకున్నారు. శాంతి ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీని తొలుత అనకాపల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.బాబర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. మత పెద్దలు అబ్దుల్ కలాం ఆజాద్, మౌలానా నసీం, మక్బూల్, మౌలానా జాఫర్, ఎస్కే బుఖారి, సయ్యద్ సలీం, సయ్యద్ తాజుద్దీన్, అబ్దుల్ మజీద్, నూర్ నబి, సయ్యద్ రహమతుల్లా, ఎస్ఎంఎస్ ఆలీ, ఎంఏ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలో ముస్లింలు మిలాద్ వున్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదు ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాయకరావుపేట, తుని పట్టణాల్లో శాంతి ర్యాలీ జరిపారు.

నక్కపల్లి : మండలంలోని పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పలపాయకరావుపేట, పెదదొడ్డిగల్లు, రామకృష్ణాపురం తదితర గ్రామాల్లో సోమవారం మిలాద్ వున్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో బావుటాలను ఎగురవేసి, ఊరేగింపులు చేశారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ఈ పండుగ నిర్వహిస్తామని మత పెద్దలు తెలిపారు.

ఎస్.రాయవరం : మండలంలోని ముస్లింలు మిలాద్ వున్ నబీ వేడుకులను ఘనంగా జరుపుకున్నారు. దార్లపూడి సమీపం చెల్లాపురం, పెదగుమ్ములూరు సమీపం సీతారామపురం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతనతరం శాంతి ర్యాలీలు చేపట్టారు.

ఎలమంచిలి : పట్టణంలో ముస్లింలంతా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడి దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న జామియా మసీదు నుంచి శాంతి యాత్ర చేపట్టారు. జామియా మసీద్ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

‘రక్తదానం ప్రాణదానంతో సమానం’



రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన అమ్మా హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అక్టోబరు రెండో తేదీన వడ్డాదిలో ఏర్పాటు చేయనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను సోమవారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యంగా యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, సంస్థ ప్రతినిధి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరగనుందని మండల కో-ఆర్డినేటర్ ఎస్వీ నరసింహం తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తొలిరోజు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, యోగా, చెస్ పోటీలకు జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్‌లో బాల బాలికలకు వేర్వేరుగా ఎంపిక ఉంటుందన్నారు. 20న జీవీఎంసీ హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ (బాలికలు), 21న అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ (బాలురు) ఎంపిక ప్రక్రియ జరుపుతామన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అండర్-14కు 2011 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టిన వారు, అండర్-17కు 2008 జనవరి ఒకటి తరువాత పుట్టినవారు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 92471 50037 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

తైక్వాండోలో అనకాపల్లి విద్యార్థిని ప్రతిభ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : తమిళనాడులో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా తైక్వాండో ఫేస్-2 పోటీల్లో అనకాపల్లికి చెందిన ఎస్ఎస్ అంజినీప్రియా అద్భుతంగా రాణించింది. దీంతో నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. 68 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం ఆమెను టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ అభినందించారు. ఏపీ తైక్వాండో అసోసియేషన్, టీఎఫ్ఐ అధ్యక్షుడు టి.హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు పి.మురళీకృష్ణ, కోచ్ డీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : మద్యం బాటిళ్లతో వెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన లోకనాథం శ్రీనివాస్ సంచిలో ఆరు మద్యం బాటిళ్లతో సోమవారం రింగురోడ్డు జంక్షన్‌లో ఉన్నాడన్నారు. తమ సిబ్బందికి అనుమానం వచ్చి తనిఖీ చేయగా, బాటిళ్లకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కోటవురట్ల ఎస్ఐగా రమేష్ బాధ్యతలు

కోటవురట్ల, సెప్టెంబరు 16 : ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్.రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దిశ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇంత వరకు ఈ స్థానంలో ఉన్న రమణయ్య అనకాపల్లి ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త ఎస్ఐకి సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి ఘన స్వాగతం పలికారు.



ఎస్ఐగా రమేష్

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పూడిమడక విద్యార్థి ఎంపిక

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని పూడిమడకకు చెందిన రాజాన తులసీ పైడియ్యానాయుడు అనే విద్యార్థి అండర్-16 బాల్ బ్యాడ్మింటన్ విభాగం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరియానాలో ఈనెల 25 నుంచి జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడనున్నాడు. గత ఏడాది కూడా రాష్ట్రం తరపున జట్టులో ఆడి అద్భుత ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అతనిని గ్రామ పెద్దలతో పాటు తోటి క్రీడాకారులు అభినందించారు.



తులసీ పైడియ్యానాయుడు

‘పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి’

పాయకరావుపేట, సెప్టెంబరు 16: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు, ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కోసం పాయకరావుపేట నుంచి పరవాడ వరకు సీపీఎం చేయతలపెట్టిన రక్షణ యాత్ర బైక్ ర్యాలీని సోమవారం ఇక్కడ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.జగ్గునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లాలో గత రెండున్నర దశాబ్దాల్లో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలన్నింటిలో కంటే గత నెల అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాలో జరిగింది అతిపెద్ద ప్రమాదమన్నారు. ఈ ఫార్మా కంపెనీ యాజమన్యం తీవ్ర నిర్లక్ష్యం, ప్రభుత్వాల అలసత్వానికి 17 మంది కార్మికులు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను అమలు చేయకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి, పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. ప్రమాదకర ఫార్మా, కెమికల్ కంపెనీల్లో తరచూ తనిఖీలు చేయాలని, పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాయకరావుపేటలో ప్రారంభమైన రక్షణ యాత్ర ఈ నెల 20న పరవాడలో ముగుస్తుందన్నారు. సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపడతామన్నారు. బెంగళూరు, చెన్నై నగరాలకు కూడా వందే భారత్ రైళ్లు వేయించడానికి కృషి చేస్తామన్నారు. రూ.400 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, వందే భారత్ రైళ్లలో టికెట్ చార్జీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించి, సామాన్యులు కూడా పయాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ హరికుమారి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రసంగించగా, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు పాల్గొన్నారు.

23 వరకు ఈ-క్రాప్ నమోదుకు అవకాశం


బంగారుమెట్టలో రైతులతో మాట్లాడుతున్న ఏవో భాస్కరరావు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16: వరదలు కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పెంచిందని వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన బంగారుమెట్టలో వరి సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌తోపాటు కేవైసీ చేసుకోవాలని కోరారు. వన్‌బి, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు కాపీలను సమర్పించాలని రైతులకు ఏఓ సూచించారు. ఆయన వెంట వీఏఏ బైసీ పాల్గొన్నారు.

రీ సర్వే తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోండి

» తహసీల్దార్ మహేశ్వరరావు

రావికమతం, సెప్టెంబరు 16: మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్‌ఏ మహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33 రెవెన్యూ గ్రామాల్లో 19 గ్రామాలలో భూముల రీ సర్వే పూర్తయిందన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ యజమాని పేర్లు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, ఆన్‌లైన్లో తప్పుగా నమోదయ్యాయని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను దరఖాస్తు రూపంలో వీఆర్వోలకు అందజేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయన్నారు. మండలంలో అందిన ఫిర్యాదులపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు.

గేదెలను రక్షించబోయి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


మృతిచెందిన మాణిక్యం

గొలుగొండ, సెప్టెంబరు 16: చెరువులో గేదెలను రక్షించబోయి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. మండంలోని చీడిగుమ్మల గ్రామానికి చెందిన కట్టా మాణిక్యం(69) ఆదివారం మధ్యాహ్నం పశుగ్రాసం మేసేందుకు తీసుకువెళ్లాడు. సమీపంలో ఉన్న చెరువులోకి పాడి గేదెలు దిగడంతో వాటిని బయటకు తోలేందుకు ప్రయత్నించగా మాణిక్యం ఊబిలో చిక్కుకుపోయి మృతి చెందినట్టు తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి స్వల్ప గాయాలు

గొలుగొండ, సెప్టెంబరు 16: ఎదురెదురుగా వస్తున్న కారు బైక్ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయని ఎస్‌ఐ రామారావు తెలిపారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రాజులబాబు గుడి వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొట్టినట్టు తెలిపారు. నర్సీపట్నం నుంచి ఏలేశ్వరం వెళుతున్న కారు, కృష్ణాదేవిపేట నుంచి నర్సీపట్నం వస్తున్న బైక్ రాజులబాబు గుడి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రెండు ఢీకొట్టినట్టు తెలిపారు. ఈ సంఘటనలో మణికంఠ, మధుప్రియలకు స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేయించినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పూడిమడక విద్యార్థి ఎంపిక


తులసీ పైడియ్యనాయుడు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని పూడిమడకకు చెందిన రాజాన తులసీ పైడియ్యనాయుడు అనే విద్యార్థి అండర్- 16 బాల్ బ్యాడ్మింటన్ విభాగం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరియానాలో ఈనెల 25 నుంచి జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడనున్నాడు. గత ఏడాది కూడా రాష్ట్రం తరఫున జట్టులో ఆడి అద్భుత ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అతనిని గ్రామ పెద్దలతో పాటు తోటి క్రీడాకారులు అభినందించారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపడతామన్నారు. బెంగళూరు, చెన్నై నగరాలకు కూడా వందే భారత్ రైళ్లు వేయించడానికి కృషి చేస్తామన్నారు. రూ.400 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, వందే భారత్ రైళ్లలో టికెట్ చార్జీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించి, సామాన్యులు కూడా ప్రయాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ హరికుమారి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రసంగించగా, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు పాల్గొన్నారు.

నకష్టాల్లో చెరకు సాగు

... 5వ పేజీ తరువాయి

సత్ఫలితాలు ఇవ్వడంలేదు. చెరకు సాగు చేయాలంటే ఎకరాకు మూడు టన్నుల విత్తనం అవసరం. విత్తనం చెరకు టన్ను రూ.4-5 వేలు వుంటుంది. దీంతో విత్తనం ఖర్చే ఎకరాకు రూ.12-15 వేలు అవుతున్నది. అరటిలో మాదిరిగా టిష్యూ కల్చర్ ద్వారా చెరకు విత్తనాన్ని అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు రెండు దశాబ్దాల నుంచి పరిశోధనలను కొనసాగిస్తూనే వున్నారు.

పదేళ్లలో ఐదో వంతుకు పడిపోయిన సాగు విస్తీర్ణం

జిల్లాలో పదేళ్ల క్రితం (2014లో) 82 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఆ తరువాత నుంచి సాగు ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. అంతేస్థాయిలో చెరకు మద్దతు ధర పెరగడంలేదు. దీంతో రైతులు క్రమేపీ చెరకు సాగు నుంచి బయటకు వచ్చేస్తున్నారు. 2019లో 48 వేల ఎకరాలకు, 2022నాటికి 37 వేల ఎకరాలకు, గత ఏడాది 19 వేల ఎకరాలకు, ఈ ఏడాది 15 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

స్కూల్ కాంప్లెక్సులు కుదింపు

... 5వ పేజీ తరువాయి

బలిఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు. గొలుగొండ మండలంలో ఏల్‌పురం, జోగుంపేట, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, కొత్త మల్లంపేట స్కూల్ కాంప్లెక్సులు ఉండగా... రీఆర్గనైజేషన్‌లో భాగంగా కొత్త మల్లంపేట స్కూల్ కాంప్లెకును ఎత్తివేయనున్నట్టు తెలిసింది. విద్యార్థులకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు స్కూల్ కాంప్లెక్స్‌లోనే జరిగేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నారు.

సీఆర్‌ఎంటీలలో ఆందోళన

స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సీఆర్‌ఎంపీలలో ఆందోళన మొదలైంది. ఒక్కొక్క స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఒక సీఆర్‌ఎంపీ పని చేస్తున్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని స్కూల్ కాంప్లెక్స్‌లను ఎత్తివేస్తే వాటిల్లో పని చేస్తున్న సీఆర్‌ఎంటీలను ఏం చేస్తారన్న దాని మీద స్పష్టత లేక పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జయంతి


చోడవరం: వెంకన్నపాలెం మసీదులో ముస్లింతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

నర్సీపట్నం, సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద మసీదు నుంచి అబీద్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పెదబొడ్డేపల్లి మసీదు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి పెదబొడ్డేపల్లి మసీదు కమిటీ సభ్యులతో కలిసి స్థానిక జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వెంకన్నపాలెంలో..

చోడవరం: మండలంలోని వెంకన్నపాలెం మసీదులోని సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు రాజు వేడుకల్లో పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఏడువాక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై గ్రీన్ క్లబ్ అవగాహన ర్యాలీ



జెండా ఊపి గ్రీన్ క్లబ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, సెప్టెంబరు 16 : ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్డీవో జయరాం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకత, దాని పరిరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రీన్‌క్లబ్ సభ్యులు పర్యావరణ పరిరక్షణ కోసం ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, పెదబొడ్డేపల్లి కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ జరిగింది. అనంతరం ఓజోన్ పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు డీజీ నాథ్, ఎ. రమణమూర్తి, బి. అప్పారావు, వరహాల నాయుడు, జీవీ రమేశ్, అల్లు అప్పారావు, బాబీ మాస్టారు, ఎంఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా విజేతలకు అభినందన


యోగా క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, సెప్టెంబరు 16 : రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించిన యోగా క్రీడాకారులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అభినందించారు. ఈనెల 14, 15 తేదీల్లో భీమిలిలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర యోగా పోటీల్లో పట్టణానికి చెందిన గొంతిన లయవర్ధన్, పొట్నూరు పవన్ కుమార్ ద్వితీయ, నాలుగో స్థానంలో నిలిచి వచ్చే నెల హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ యోగా పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజు వారిని అభినందించి జాతీయ స్థాయిలో సత్తచాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు


వైబీపట్నంలో టీడీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

నాతవరం, సెప్టెంబరు 16: మండలంలోని వైబీపట్నంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు సమక్షంలో సోమవారం వైసీపీ చెందిన ముస్లిం కుటుంబాలు షేక్ మహబూబ్ సుభాన్, షేక్ మీరా, షేక్ చాంద్, షేక్ అబ్బాస్ షేక్ అజీషా, షేక్ రబ్బానీ తదితరులు టీడీపీలో చేరారు. భవిష్యత్తులో వైబీపట్నంలో అయ్యన్నపాత్రుడు అభివృద్ధి పనులు చేస్తారన్న నమ్మకంలోనే టీడీపీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైబీపట్నం టీడీపీ నాయకులు కోరుప్రోలు దొరబాబు, షేక్ నాగూర్, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేశ్ తదితరులు

అనకాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రక్త దానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన అమ్మా హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అక్టోబరు రెండో తేదీన వడ్డాదిలో ఏర్పాటు చేయనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను సోమవారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యంగా యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, సంస్థ ప్రతినిధి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు


కె.కోటపాడు: వినాయకున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు, పైలా ప్రసాదరావు


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో వినాయకుడుని దర్శించుకుంటున్న తాతయ్యబాబు

కె.కోటపాడు, సెప్టెంబరు 16: జిల్లాలో పలు మండలాల్లో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెంలో గణపతిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు, శ్రేణులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధనను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కశిరెడ్డి అప్పలనాయుడు, బత్తి రమణ, కన్నూరు అప్పలనాయుడు, రొంగలి మహేష్, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, కొట్టాన రాము, బండారు నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

మండలంలో కొమిర, కొత్తకోట, మత్స్యవానిపాలెం గ్రామాలలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొమిరలో రామాలయం వద్ద సర్పంచ్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వినాయకుడిని పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అలాగే కొత్తకోటలో నందీశ్వర యూత్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలోనూ, బాల విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలోనూ, లంబోదర యూత్ ఆధ్వర్యంలోనూ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మత్స్యవానిపాలెంలో సర్పంచ్ మలిచెట్ల గణేష్ ఆధ్వర్యంలో వినాయక అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దేవరాపల్లిలో..

మండలంలో నాగయ్యపేట, తామరబ్బ, దేవరాపల్లి, కాశీపురం, రైవాడ, బి.కింతాడ పలు గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి విగ్రహాలను అట్టహాసంగా ఊరేగించారు. నాగయ్యపేటలో 20 కిలోల లడ్డును గ్రామానికి చెందిన జామి శ్రీరామమూర్తి వేలం పాడారు. దేవరాపల్లిలో సోమవారం జరిగిన అన్న సమారాధనలో మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు. బి.కింతాడలో తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిం నాగేశ్వరరావు ఐదు వేలు విరాళంగా అన్న సమారాధనకు అందజేశారు. రైవాడలో చల్లా నానాజీ తతితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో..

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది పెద్దబజారు వీధిలో చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, దొండా నరేష్, దాడి సూర్యనాగేశ్వరరావు, దాడి పెదగోవింద స్వామివారిని దర్శించుకున్నారు.

చీడికాడలో..

మండలంలోని మంచాల గ్రామంలో సోమవారం అన్నసమారాధన జరిగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో శగిడీలు కళ్లాలు, అసిరినాయుడు కళ్లాలు, పెద్దింటివారి కళ్లాలు కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థుల ఆర్థిక సాయంతో చేసిన అన్నసమారాధనకు మంచాల, కోనాం, శిరిజాం గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు.

మాడుగులలో..

మాడుగుల కేంద్రంలో సోమవారం వినాయక అనుపు మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి రోజున ఏర్పాటుచేసిన విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఊరేగింపుగా తీసుకువెళ్లి అనుపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాడుగుల రూరల్‌లో..

మాడుగుల హైస్కూల్ కాలనీలోని సిద్ది వినాయక ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంచిపెట్టారు. నవరాత్రులు పూర్తవ్వడంతో సోమవారం వినాయక విగ్రహాలను ఊరేగించిన అనంతరం సమీపంలోని చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు.


దేవరాపల్లి: నాగయ్యపేటలో లడ్డు వేలం పాడుకున్న భక్తుడు

☛ సంక్షిప్తంగా..

నేటి నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు

కె.కోటపాడు, సెప్టెంబరు 16 : ఈనెల 17 నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు 15 రోజులుపాటు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రతి రోజు ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపు, ర్యాలీ, గ్రామసభలు ఏర్పాటు జరుగుతుందన్నారు.

మద్యం షాపుల్లో కల్లు గీత కార్మికులకు రిజర్వేషన్ కల్పించాలి

రోలుగుంట, సెప్టెంబరు 16 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చే మద్యం పాలసీలో కల్లుగీత కార్మికులకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ టీడీపీ బీసీ యాత సాధికారత రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఉత్తరాంధ్ర జిల్లాలో యాత, శెట్టి, బలిజ, గౌడ, ఈడిగ తదితర కులస్తులు అధికంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపుల్లో వీరికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ సామాజిక వర్గానికి డిపాజిట్ పరిమితిని తగ్గించి టెండరులో పాల్గొన్న వారికి ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి ఒప్పంద కార్మికుల సమస్యలపై వినతులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 16 : వైద్య విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల వేత బకాయిలు, సమస్యలపై మంగళవారం నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రమణ తెలిపారు. సోమవారం వైద్య విభాగంలో పనిచేస్తున్న కార్మికుల వేతన బకాయిలు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 16వ రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి, నెలాఖరులోగా సమస్యలు పరిష్కరించక పోతే 30వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.

నేడు అనకాపల్లి ఎంపీ మాడుగుల రాక

మాడుగుల, సెప్టెంబరు 16: అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్ మంగళవారం మాడుగుల రానున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు దంగేటి సూర్యారావు తెలిపారు. ఎంపీ అయిన తరువాత తొలిసారి మాడుగుల కేంద్రానికి రానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలో సమావేశమవుతారని తెలిపారు.

చీడికాడ ఎస్ఐగా సతీష్ బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సతీష్

చీడికాడ, సెప్టెంబరు16: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.సతీష్ సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన నారాయణరావు వి.మాడుగుల బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో హుకుంపేట నుంచి బదిలీపై వచ్చిన సతీష్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నాగేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఎస్ఐని అభినందించారు.

24న అనకాపల్లిలో సదరం పింఛన్ల పరిశీలన

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16: అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 24వ తేదీన బుచ్చెయ్యపేట మండలంలో సదరం పించన్ల పరిశీలన జరగనున్నదని సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త పించన్లు మంజూరు చేయడం జరగదన్నారు. కొత్త పింఛన్ గురించి వివరాలు తెలుసుకోవాలంటే దివ్యాంగుల బంధువులు ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కల్లుగీత కార్మికుల కాలనీలో బోరు

» హామీ నెరవేర్చిన అయ్యన్న యువసేన సభ్యులు


కాలనీలో వేసిన బోరు

నాతవరం, సెప్టెంబరు 16: స్థానిక కల్లుగీత కార్మికుల కాలనీలో లక్ష రూపాయల వ్యయంతో అయ్యన్న యువసేన సభ్యులు చేతిపంపు ఏర్పాటు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో అయ్యన్న యువసేన సభ్యులు అపిరెడ్డి మాణిక్యం, యర్రా కాశీ, చింతకాయల శ్రీను గొల్లులోవ తదితరులు ఇచ్చిన హామీ మేరకు బోరు వేయించారు. ఇంకా హెడ్ బిగించలేదు. బోరు వేస్తే తమ తాగునీటి సమస్య తీరుతుందని కల్లుగీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరులో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

రోలుగుంట, సెప్టెంబరు 16 : మండలంలోని కొవ్వూరులో సోమవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభను నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగే పనులపై గ్రామ సభలో చర్చించారు. కొవ్వూరులో జరిగిన వివిధ పనులను సభలో డీఆర్పీ రాజు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను వివరించారు. ఉపాధి పథకంలో నిర్మించిన గోకులం షెడ్డుకు నేటికీ బిల్లులు మంజూరు కాలేదని, వెంటనే మంజూరు చేయించాలని రైతు బంటు రాజు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ నాగేంద్ర, ఏపీఓ సూర్యమణి, సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ పాల్గొన్నారు.

రూరల్ సీఐ రేవతమ్మని మర్యాదపూర్వంగా కలిసిన నేతలు

నర్సీపట్నం రూరల్ , సెప్టెంబరు 16 : చెట్టుపల్లికి చెందిన పలువురు నాయకులు రూరల్ సీఐ రేవతమ్మని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్‌లు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇ. రమణ, మోపాడ సత్య ప్రసాద్, ఎర్రంశెట్టి పాపారావు, ఊడి కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.